


# చివరి రోజు నామినేషన్ల జోరు

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థులు నరేందర్ రెడ్డి, రవీందర్ సింగ్.. టీచర్ అభ్యర్థులు యాదగిరి శేఖర్‌రావు, సుహాసిని








ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



ర్యాలీలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటో ఓ అభిమాని

కలెక్టరేట్, ఫిబ్రవరి 10 : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నామినేషన్ల జాతర సోమవారం ముగిసింది. చివరి రోజూ హోరెత్తింది. సోమవారం గ్రాడ్యుయేట్ స్థానానికి 51 మంది, టీచర్ స్థానానికి 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు వందలాది మంది అనుచరులతో తరలివచ్చి నామినేషన్ల దాఖలు చేశారు. అయితే రవీందర్ సింగ్ నామినేషన్ ర్యాలీలో ఓ అభిమాని, ఒగ్గు కళాకారులు కేసీఆర్ చిత్రపటంతో ప్రదర్శనలు ఇచ్చారు.

## విలాసాల కోసం మేకల దొంగతనం

- నిందితుల అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన మేకల దొంగలు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 10 : విలాసాల కోసం అడ్డదారులు తొక్కి, చివరకు కటకటాల పాలయ్యారు. మేకలను దొంగలించి అడ్డంగా దొరికిపోయారు. కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐ వెంకటేశ్ వివరాల ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన మానుపాటి శేఖర్, కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన శివరాత్రి రమేశ్, చొప్పదండికి చెందిన మానుపాటి సంజీవ్‌కుమార్‌తో పాటు మరికొంత మంది కలిసి అప్పుడప్పుడు మద్యం పార్టీలు చేసుకునేవాళ్లు. వీరంతా విలాసాల కోసం రాత్రి పూట ఇళ్లలో దొంగతనాలు చేయాలని పథకం వేశారు. ఈ నెల 2న రెండు కార్లు, బొలేరో క్యాంపర్ వ్యాన్‌లో అర్ధరాత్రి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లారు. ఆ రోజు పొద్దంతా అక్కడే గడిపారు. 3న అర్ధరాత్రి సమయంలో తిప్పనవేన ఎర్ర కొమురయ్య ఇంటి కాంపౌండ్ గోడ దూకారు. మేకల కొట్టం నుంచి మూడు మేకలను దొంగిలించి, వారి వాహనాల్లో ఎక్కించుకున్నారు. తర్వాత మల్యాల గ్రామానికి వెళ్లి బొల్లి రాజయ్య మేకల కొట్టం నుంచి రెండు మేకలను తమ వాహనాల్లో ఎక్కించుకొని పారిపోయారు. చొప్పదండి చేరుకున్న తర్వాత ఐదు మేకలను సంజీవ్‌కుమార్ కొట్టంలో ఉంచారు. ఈ నెల 9న మళ్లీ దొంగతనం చేద్దామనుకొని రమేశ్, సంజీవ్‌కుమార్ కొత్త కారులో కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు గంగారం క్రాస్ రోడ్డు వద్ద నిందితులను పట్టుకున్నారు. అనంతరం చొప్పదండికి వెళ్లి, ఐదు మేకలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితులు పరారీలో ఉండగా, అదుపులోకి తీసుకున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రధాన అర్చకుడిపై దాడి దురదృష్టకరం

రామగిరి, ఫిబ్రవరి 10: హైదరాబాద్‌లోని ప్రసిద్ధ చిలుకూరి బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి దురదృష్టకరమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి, సెంటినరీకాలనీ భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ సుముద్రాల విజయసారథి తెలిపారు. దైవసేవలో నిమగ్నమైన బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రంగరాజన్‌ను బెదిరించి దాడి చేయడం అమానుషమని, నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలని కోరారు.



కమాన్‌పూర్ : ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

## ముసాయిదా ఓటరు జాబితా విడుదల

మంథని, ఫిబ్రవరి 10: మంథని మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను ఎంపీడీవో శశికళ అధికారులు, సిబ్బందితో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంథని మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 35,055 మంది ఓటర్లుగా నమోదు చేశామని ఇందులో 17,062 మంది పురుషులు, 17,989 మంది స్త్రీలు, నలుగురు ఇతరులు ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఈ ఓటర్లు లిస్టులో ఓటర్లకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 14వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని వెల్లడించారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 10 : మండలంలోని ప్రాదేశిక నియోజక వర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. ఆయా పంచాయతీల్లో కార్యదర్శులు ఓటర్ల జాబితాను జీపీల్లో ప్రదర్శించారు. మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల్లోని ఏడు ఎంపీటీసీ స్థానాల్లో మొత్తం 20,178 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి10: మండల ప్రాదేశిక ఎన్నికల ఓటరు జాబితాను ఎంపీడీవో రామ్మోహనాచారి పంచాయతీ కార్యదర్శులతో కలిసి విడుదల చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 34738మంది కాగా పురుషులు 17189 మంది, మహిళలు 17548 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 65 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. విడుదల చేసిన ఓటరు జాబితాను జీపీ లో ప్రదర్శించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పులు, సవరణలు ఉంటే సరి చేసుకోవాలని సూచించారు. ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రామగిరి ఫిబ్రవరి 10 : మండలంలోని 13 ఎంపీటీసీ స్థానలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఎంపీడీవో శైలజరాణి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ ఓటర్ల జాబితాను మండలంలోని అన్ని జీపీ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఉమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## బంగారం వ్యాపారిపై కేసునమోదు

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 6: నాలుగు దశబ్దాలుగా ప్రజల నమ్మించి దాదాపు రూ. 8కోట్లతో పారిపోయిన బంగారం దుకాణాదారునిపై సోమవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో కేసునమోదైంది. నగరంలోని లక్ష్మీనగరంలో బులియన్ బంగారం వ్యాపారం చేస్తున్న శ్రీనాథ్ జ్యూవెల్లర్స్ దుకాణాదారుడు సింగరేణి కార్మికులు, రిటైర్డు కార్మికుల నుంచి పెద్ద ఎత్తున వడ్డీకి రుణంగా తీసుకున్నాడు. పెళ్లిళ్ల పేరిట బంగారు అభరణాల ఆర్డర్‌కు తీసుకొని పారిపోయాడు. ఇటీవల బాధితులు దుకాణం ముందు ఆందోళన చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఫిబ్రవరి 10: జిల్లాలో పీఎం శ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్దేశిత అభివృద్ధి పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎం శ్రీ పాఠశాలలపై సంబంధిత అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా పీఎం శ్రీ కింద 2 విడుతల్లో 16 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీటిలో నిర్దేశిత మొదటి దశ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా కార్యాచరణ అమలు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**భూగర్భ జలాల నాణ్యత నివేదిక అందించాలి**

భూగర్భ జలాల నాణ్యతను పరీక్షించి నివేదిక అందించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంచార నీటి నాణ్యత ప్రయోగశాల వాహనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టు కింద భూగర్భ జలాల నాణ్యత విశ్లేషణ కోసం ఏర్పాటు చేసిన సంచార నాణ్యత ప్రయోగశాల (మొబైల్ క్వాలిటీ ల్యాబ్ ఆన్ వీల్స్)ను సమర్థవంతంగా వినియోగించుకోని నీటి నాణ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలి అధికారులకు సూచించారు. రామగుండం పరిసర ప్రాంతాలు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతంలో భూగర్భ జలాల నాణ్యతపై అధ్యయనం చేసి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఇక్కడ జిల్లా భూగర్భ జలాల అధికారి జీ లావణ్య, హైడ్రాలజిస్టు సీహెచ్ వేణు, జియాలజిస్టు సుజాత, సిబ్బంది ఉన్నారు.

**మట్టి, మొరం తీసుకునేందుకు అనుమతి**

సామాన్య ప్రజలకు సొంత అవసరాల కోసం అవసరమైన మట్టి, మొరం తీసుకునేందుకు తహసీల్దార్ల ద్వారా అతి తక్కువ ధరకు అనుమతి మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సొంత ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి, మొరం సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని వివరించారు. మట్టి, మొరం తీసుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.200, టిప్పర్‌కు రూ.800 రుసుం తహసీల్దార్‌కు చెల్లించి అనుమతి పొందాలని వివరించారు. మట్టి సొంత అవసరాలకు మాత్రమే వాడాలని, ఎక్కడా డంప్ చేయటానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టి తరలించాలని పేర్కొన్నారు. ఆదివారం, సెలవు దినాల్లో తరలింపునకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

## గౌడ సంఘం సొసైటీ ఎన్నిక

ముత్తారం, ఫిబ్రవరి 10: మండలంలోని ఓడేడ్ గ్రామంలో గౌడ సంఘం సొసైటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాసరి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా ఇల్లందుల తిరుపతి గౌడ్‌తో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

## సెల్ టవర్ నిర్మాణం పై ఆందోళన

ముత్తారం, ఫిబ్రవరి 10: మండలంలోని అడవి శ్రీరాంపూర్ లో జరుగుతున్న ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రజలు నివసించే ఇండ్ల మధ్యలో సెల్ టవర్ నిర్మించడం ఏమిటంటూ ప్రశ్నించారు. అలాగే సెల్ టవర్ నిర్మించడం వల్ల రేడియేషన్ తో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ దృష్టికి తీసుకెళ్లగా ఎంపీడీవో సురేశ్‌తో మాట్లాడి పనులు నిలిపివేసే విధంగా చూడాలని తెలుపగా, సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో పనులు నిలిపివేసేలాగా చర్యలు తీసుకుంటామని తెలిపారని పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ట్రినిటీ విద్యార్థి



క్రీడాకారుడిని అభినందిస్తున్న అకాడమిక్ డైరెక్టర్ మమతారెడ్డి

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 10 : ఇటీవల ఎన్టీపీసీలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దపల్లి ట్రినిటీ (సీబీఎస్ఈ) ఎనిమిదో తరగతి విద్యార్థి ఆర్. విష్ణువర్ధన్ లాంగ్‌జంప్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ మమతారెడ్డి తెలిపారు. ఈ నెల 18,19 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. సోమవారం ట్రినిటీ (సీబీఎస్ఈ)లో విష్ణువర్ధన్‌ను విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ పుష్పగుచ్ఛాలు అందించి, అభినందించారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, పీఈటీలు అజయ్, నితీశ్, మౌనిక, ఉపాధ్యాయులు ఉన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

రామగిరి, ఫిబ్రవరి 10: రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సెంటినరీకాలనీ, రాంనగర్, రత్నాపూర్‌లో 30 మంది నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు దంపతులను స్థానికులు శాలువాతో సన్మానించారు. సెంటినరీకాలనీ స్టేడియంలో వాలీబాల్ క్రీడాకారులు పీవీరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి శాలువాతో సత్కరించారు. ఇక్కడ బొద్దుల జగన్, సూదుల ఐలయ్య, ఆవునూరి శ్యామ్, శ్రీకాంత్, తిరుపతి, రవి, రొడ్డ శ్రీనివాస్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 10: సాంబయ్యపల్లి గ్రామశివారులో శనివారం రాత్రి రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైలు డైవర్ నవీన్ కుమార్ ,రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ తిరుపతిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాంబయ్యపల్లి గ్రామ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలపై వెళ్తుండగా మూల మాలుపు వద్ద రైలు రాకతో పక్కకు తప్పుకునే క్రమంలో ప్రమాదవ శాత్తు కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి(65) మృతి చెందాడు. మృతుడు పసుపు రంగు హాఫ్ షర్టు గీతల డిజైన్ నిక్కర్ ధరించాడు. రైలు పట్టాల పక్కన తెల్లని ధోతి ఉంది. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవు. మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ మార్చురీలో భద్రపరిచారు. కేసును రామగుండం రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ తిరుపతి దర్యాప్తు చేస్తున్నారు. ఏమైనా వివరాలు తెలిస్తే 9949304574, 87126 58604 ఫోన్ నెంబర్లుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.